క్లుప్తంగా

ఎరువుల సరఫరాపై సమీక్ష

బోధన్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు ఎరువుల సరఫరా అంశం పై బుధవారం నవీపేట మండల కేంద్రంలోని సొసైటీలో నవీపేట, ఎడపల్లి, రెంజల్ మండలాల పరిధిలోని సొసైటీల సీఈవోలతో డీసీవో శ్రీనివాస్‌రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. పంట దశ, సాగు భూమి విస్తీరణం మేరకు రైతులకు ఎరువులు సరఫరా చేయాలని సూచించారు. ఏడీఏ అలీం అహ్మద్, మండల వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్, సొసైటీల సీఈవోలు పాల్గొన్నారు.

జీపీని తనిఖీ చేసిన డీఎల్‌పీవో



బాల్కొండ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీని డీఎల్‌పీవో శివకృష్ణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీపీ రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ఇంటి నిర్మాణాల అనుమతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో గంగామోహన్, ఈవో రజనీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

బాల్కొండ: ఖరీఫ్‌లో సాగవుతున్న పంటల కోసం కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచకుండా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ముప్కాల్ మండల వ్యవసాయాధికారి సాయికృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని రెంజర్ల సహకార సంఘంలోని ఎరువులను పరిశీలించారు. సహకార సంఘంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, యూరియా కొరత లేదన్నారు. ఆయన వెంట రైతులు, సిబ్బంది ఉన్నారు.

కోటగిరిలో బస్టాండ్ నిర్మించాలి



రుద్రూర్: మండల కేంద్రమైన కోటగిరిలో అన్ని వసతులతో కూడిన బస్టాండ్ నిర్మాణాన్ని చేపట్టాలని బాన్సువాడ నియోజకవర్గ సీపీఐ పార్టీ ఇన్‌చార్జి దుబాస్ రాములు, కోటగిరి మండల సీపీఐ కార్యదర్శి ఎ విఠల్‌గౌడ్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోటగిరిలో బస్టాండు లేనందున విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి బస్టాండ్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నల్ల గంగాధర్, శంకర్, ప్రసాద్, గూడుమియా, గజేందర్, శివ, మారుతి, ఇమ్రాన్, నారాయణ, రాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్ల పంపిణీ

మోర్తాడ్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలనే ఉద్దేశంతో బుధవారం మోర్తాడ్ మండలం సుంకెట్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.40 వేల విలువ చేసే బూట్లను పంపిణీ చేశారు. నల్గొండ జిల్లా హాలియాకు చెందిన వజ్రతేజ రైస్‌మిల్లు యజమాని చిట్టిపోలు యాదగిరి సహకారంతో వీటిని కొనుగోలు చేసినట్లు హెచ్‌ఎం పెద్ది సంతోష్‌కుమార్ తెలిపారు. తాము కోరగానే సహకరించిన దాతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది

బాల్కొండ: దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన పార్టీ కాంగ్రెస్ అని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో అధికారం కోసం కాంగ్రెస్ ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు అవుతోందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూడా అవినీతి పాలన కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలను వదిలేసి సంబురాలను జరుపుకోవడం సిగ్గు చేటన్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైల్లో పెడతారా?

రుద్రూర్: కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైల్లో పెడుతున్నారని, ఇది అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తోందని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో బుధవారం ఎమర్జెన్సీకి 50 ఏళ్లు, దేశంలో ప్రజాస్వామ్యం–సవాళ్లు అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాసం చేసే చర్యలు కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. సదస్సులో సీపీఐ నాయకుడు సాయిబాబాగౌడ్, ప్రజా సంఘాల నాయకులు అర్జున్, వసురాం, సునీత, పోశెట్టి, లింగవ్వ, నాగరాజు, హన్మాండ్లు, సాయిలు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని పూర్తి చేయించండి

మోర్తాడ్: భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలో నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రి భవనాన్ని పూర్తి చేయించాలని కలెక్టర్‌కు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నీలం రవి విన్నవించారు. బుధవారం పట్టణంలో పర్యటించిన కలెక్టర్‌ను వీడీసి ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆస్పత్రి భవనం అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు వైద్య సేవల కోసం ఆర్మూర్, నిజామాబాద్ పట్టణాలకు వెళ్లాల్సి వస్తుందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. భవన నిర్మాణం పూర్తయితే వైద్య సేవలు ఇక్కడే అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు.

గ్రామాల్లో సమస్యల తిష్ట

- అధ్వానంగా డ్రెయినేజీలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలు మరింత జటిలం



నందిపేట హనుమాన్ మందిరం వద్ద పేరుకుపోయిన చెత్త



నందిపేట రాజానగర్ కాలనీలో ఇళ్ల చుట్టూ చేరిన మురికి నీరు

నందిపేట్: గ్రామాల్లో రోజు రోజుకు సమస్యలు ఉధృతమవుతున్నా ప్రజల మొర ఆలకించేవారు కరువవుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తమై మురికి కూపాలుగా మారుతున్నాయి. ప్రజా ప్రతినిధుల పాలనలో నిర్లక్ష్యానికి గురైన సమస్యలు ప్రత్యేకాధికారుల పాలనలో మరింత జటిలమయ్యాయి.

ఎక్కడి సమస్యలు అక్కడే

గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయి. మురికి కాల్వలను శుభ్రపరచడం, పిచ్చిమొక్కలను తొలగించడం, వీధులను ఊడ్చడం, నీటి ట్యాంకులను శుభ్రం చేయడం, తాగునీటి పైపులైన్ల లీకేజీలను సరిచేయడం లాంటి పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలి. ఈ పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు కొంత మేరకు ప్రభుత్వం సమకూర్చగా, మిగతా పన్నుల రూపేణ వసూలు చేయాలి. కానీ గ్రామాల్లో పన్ను వసూలు కావడం లేదు. సమస్యలు పరిష్కారం కావడం లేదు.

కాలనీల్లో సమస్యలు

నందిపేట మండల కేంద్రంలోని పలు కాలనీల్లో అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. రాజానగర్ కాలనీలో మురికి కాలువలు లేక రోడ్లపైనే మురుగు ప్రవహించి ఇళ్ల చుట్టూ చేరుతోంది. ఏర్పడిన గుంతలు పందులకు నిలయమై కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్నారు. పాతూరులోని వేంకటేశ్వర కాలనీ వీధి లైట్లు లేక అంధకారంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పలు కాలనీల్లో తాగు నీటి సౌకర్యాలు లేవు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అధ్వానంగా తయారైంది

నేను రాజానగర్ కాలనీలో నివాసం ఉంటుంది. కాలనీలో మురికి కాలువలు సరిగా లేక ఇళ్ల చుట్టూ మురుగు నీరు చేరుతోంది. దీంతో అవి పందులకు నిలయంగా మారింది. దోమల బెడద ఎక్కువవుతుంది. సమస్యను అధికారులకు విన్నవించినా స్పందించడం లేదు. – శేఖర్‌రెడ్డి, రాజానగర్ కాలనీ, నందిపేట్

సమస్యలతో సతమతం

వేంకటేశ్వర కాలనీలో కనీస సౌకర్యాలు లేవు. మూడేళ్ల నుంచి కాలనీలో విద్యుద్దీపాలు, తాగు నీరు, మురుగు కాలువలు లేవు. దీంతో కాలనీ వాసులం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి – మేకల శ్రీను, వెంకటేశ్వర కాలనీ, నందిపేట్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్‌మహతో



వర్నిలో మాట్లాడుతున్న డీఎల్పీవో నాగరాజు

బోధన్ టౌన్/ వర్ని: బోధన్ పట్టణ కేంద్రంలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 10, 12 వార్డుల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. వర్షాకాలాన్ని ప్రారంభమైనందున కాలనీలోని రోడ్లు, మురికి కాలువలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వర్ని మండలంలో లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు సూచించారు. వర్ని ఎంపీడీవో కార్యాలయంలో వర్ని, రుద్రూర్, మోస్రా, చందూర్ మండలా ఎంపీవో, జీపీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు చేపట్టిన ఇళ్ల నిర్మాణాల ఆధారంగా బిల్లులు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. వర్ని ఎంపీడీవో వెంకటేశ్వర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సమత, ఎంపీవో మారుతి పాల్గొన్నారు.

పదోన్నతుల కంటే ముందే బదిలీలు చేపట్టాలి

కమ్మర్‌పల్లి: పదోన్నతుల కంటే ముందుగానే గెజిటెడ్ హెడ్మాస్టర్ల బదిలీలు చేపట్టాలని కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి, బషీరాబాద్, కోనసముందర్, కోనాపూర్, ఉప్లూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు ఆంధ్రయ్య, గంగాధర్, మధుపాల్, రామ్‌ప్రసాద్, రాజన్న డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రెండేళ్లుగా ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల సహకారంతో పాఠశాలల ఎన్‌రోల్‌మెంట్ నాణ్యమైన విద్య అందించడం, ఫలితాల సాధనలో కమ్మర్‌పల్లి మండలం ఉత్తమ స్థానంలో ఉండడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఆలోచించి జీహెచ్ఎం బదిలీల తర్వాత స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎంలు

బోధన్‌లో కానరాని ట్రాఫిక్ సిగ్నల్స్

బోధన్ టౌన్: బోధన్ పేరుకే డివిజన్‌గా ఉన్నా ట్రాఫిక్ సిగ్నల్స్ మాత్రం ఇక్కడ ఒక్కటీ లేదు. దీంతో పట్టణ కేంద్రంలోని రద్దీ ప్రాంతాల్లో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో విద్యా సంస్థలు, ఆస్పత్రులు వ్యాపార సముదాయాలు ఉండడంతో చుట్టుపక్కల ప్రాంత ప్రజలు ప్రతి రోజు రాకపోకలు సాగిస్తుంటారు. డివిజన్ కేంద్రంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు ఆచరణకు నోచుకోలేదు. ఆరు నెలల క్రితం ఓ ట్రాఫిక్ సీఐ, నలుగురు సిబ్బందిని ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు బోధన్ బాన్సువాడ వెళ్లేదారిలో ఉన్న రైల్వే గేటు వద్ద గేటు పడినప్పుడు, పట్టణంలోని ప్రధాన రహదారులపై భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. కానీ పట్టణంలోని రద్దీ ప్రాంతాలైన కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో మాత్రం ఏర్పాటు చేయలేదు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పట్టణంలో రద్దీగా ఉండే కొత్త బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా, శేఖర్‌నగర్ చౌరస్తా, పాత బస్టాండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సి ఉండగా అవి అమలుకు నోచుకోవడం లేదు. కానీ పట్టణ, ట్రాఫిక్ పోలీసులు మాత్రం ఉదయం సాయంత్రం తనిఖీల పేరుతో చలాన్లు వేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారంటు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లు కావలెను

- కాకతీయ కాలువ అత్యవసర లైనింగ్ పనుల కోసం..



జీరో పాయింట్ వద్ద కోతకు గురైన కాకతీయ కాలువ లైనింగ్

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి ఆయకట్టుకు నీటి సరఫరా చేసే కాకతీయ కాలువ లైనింగ్ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు కరువయ్యారు. పనులు చేపట్టేందుకు ప్రాజెక్ట్ అధికారులు రెండేళ్లుగా టెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

ఇదీ పరిస్థితి..

కాకతీయ కాలువ జీరో పాయింట్ వద్ద రెండేళ్ల క్రితం లైనింగ్ అత్యంత ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు అత్యవసరం కింద పనులు చేపట్టాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గత ప్రభుత్వ హయాంలోనే రూ. పది లక్షల నిధులు మంజూరయ్యాయి. నాటి నుంచి అధికారులు టెండర్లు పిలుస్తూనే ఉన్నారు. కానీ టెండర్ కావడం లేదు. దీనికి ప్రధాన కారణం చేసిన పనులకు బిల్లులు త్వరగా రావనే భావనతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నాలుగు సార్లు టెండర్ పిలిచాం

కాకతీయ కాలువ జీరో వద్ద లైనింగ్ మరమ్మతుల కోసం ఇప్పటి వరకు నాలుగు సార్లు టెండర్ పిలిచాం. ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. మళ్లీ ప్రతి పాదనలు తయారు చేస్తున్నాం. రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది.
– రఘుపతి, డిప్యూటీఈఈ, కాకతీయ కాలువ

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చూడాలి



గోవూరులో పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్



మచ్చర్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

వర్ని(మోస్రా): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండలంలోని గోవురులో కాలనీలను, ఖాళీ ప్రదేశాలను పరిశీలించారు. డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు దోమల మందులను పిచికారి చేయాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. తాగునీటిని క్లోరినైజేషన్ చేసి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలన్నారు. ప్రతి గ్రామాల్లో శానిటేషన్‌పై కార్యదర్శులు శ్రద్ధ వహించాలని సూచించారు. బోధన్ డీఎల్‌పీవో నాగరాజు, మోస్రా ఎంపీఓ వెంకటేశ్వర్లు, జీపీ కార్యదర్శి రాజశేఖర్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పెర్కిట్: వర్షాకాల సీజన్‌లో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేశ్ సూచించారు. ఆలూర్ మండలం మచ్చర్లలో బుధవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటితో పాటు పరిసరాల్లో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం దేగాం పీహెచ్‌సీ వైద్యురాలు ఆయేషా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.



అంక్సాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్

సబ్ యూనిట్ అధికారి సాయన్న, సిబ్బంది హకీల్, నళిని, సంతోష్, జీవన్, జీపీ కార్యదర్శి నసీర్, ఆశావర్కర్లు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వేల్పూర్: అంటువ్యాధులు రాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వేల్పూర్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఎస్తేర్ సూచించారు. మండలంలోని అంక్సాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది హరిప్రియ, శ్రీలత, బాలలక్ష్మి, టీచర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ఆర్మూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఏసీపీ



ఆలూర్‌లో బహుమతులను అందజేస్తున్న ఎంఈవో

ఆర్మూర్‌టౌన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాల కోసం కృషి చేయాలని ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని బాలికల, బాలుర పాఠశాలలో అలాగే ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో ఐసీడీఎస్, షీటీం, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించి గోడపత్రులను ఆవిష్కరించారు. విద్యార్థులు కష్టపడి చదివి తమ తల్లిదండ్రుల కళలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో భార్గవి, కళాశాల ప్రిన్సిపాల్, హెచ్ఎంలు, షీ టీం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిపేటలో..

నందిపేట్: నందిపేట మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ పాఠశాల, అయిలాపూర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగంపై కలిగే అనర్థాల అంశంపై వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై చిరంజీవి, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాలూరలో..

బోధన్: బోధన్ రూరల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సాలూర జెడ్పీహెచ్ఎస్‌లో మాదకద్రవ్యాల నిరోధకం అంశం పై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో రాజీ మంజూష బహుమతులను అందజేశారు. పోలీస్ సిబ్బంది శ్రావణ్, మహ్మద్‌రియాజ్, ఉపాధ్యాయులు గంధం సాయిలు, దండు రాజ్‌కుమార్, అరుణ్‌కుమార్, విజయ్‌కుమార్, స్వామి,



సాలూర జెడ్పీహెచ్ఎస్‌లో..



నందిపేటలో ప్రశంసాపత్రాలను అందిస్తున్న పోలీస్ సిబ్బంది

అబ్బయ్య, సుధారాణి, లక్ష్మి, సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో..

పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్మూర్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు మాదకద్రవ్యాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలూర్ ఎంఈవో నరేందర్, ఉపాధ్యాయులు అష్ఫాక్ అహ్మద్, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో 2కే రన్..

మోర్తాడ్: మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించడానికి ప్రజలను చైతన్య పరుస్తూ అవగాహన కల్పించేందుకు మోర్తాడ్‌లో ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో 2 కే రన్ నిర్వహించారు. మత్తు పదార్థాలను సేవించడం వల్ల జరిగే అనర్థాలను వివరిస్తూ, ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ఈ రన్ నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.

హోం మంత్రి సభను విజయవంతం చేయాలి

మాక్లూర్: పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించటానికి ఈ నెల 29న జిల్లాకు రానున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిషా సభను పార్టీ నాయకులు, రైతులు విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షురాలు మదారి మమత కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించి అమిత్‌షా కార్యక్రమంపై పార్టీ నాయకులతో చర్చించారు. పసుపు బోర్డు కార్యాలయాన్ని జిల్లా కేంద్రంలో ప్రారంభించుకోవటం పసుపు రైతులకు ఎంతో ఆనందం కలిగిస్తోందని అన్నారు. గంగోనే సంతోష్, చింత ప్రవీణ్‌రెడ్డి, డి రమేశ్‌నాయక్, మదారి రాజేశ్వర్, రాజేందర్‌రెడ్డి, సంజీవ్‌యాదవ్, రామావత్ సురేశ్, ముప్పా గంగారెడ్డి, ఎస్సీ మోర్చా నాయకుడు రాజేశ్వర్, ప్రణీత్‌యాదవ్, రాథోడ్ రాజశేఖర్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

వర్ని/ కోటగిరి: రైతులకు పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా డబ్బులు ఖాతాలో జమ చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ వర్ని, కోటగిరి మండల కేంద్రాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోటగిరిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు

బకాయి వేతనాలు చెల్లించాలి

బోధన్: జిల్లాలో జీపీల్లో పని చేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్స్‌కు సంబంధించి మూడు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ జీపీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. జీపీ కార్మికులకు ప్రభుత్వం నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదన్నారు. బుధవారం ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి జీపీ కార్యదర్శి సురేశ్‌కు కార్మికులతో కలిసి ఆయన వినతి పత్రం అందించారు. ఒప్పంద డిమాండ్ల సాధనకు ఈ నెల 27న చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జీపీ కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్, పద్మ, గంగారాం, గణేశ్, సాగర్, కార్మికులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

రుద్రూర్: కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వచ్చే నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని టీయూసీఐ రాష్ట్ర కమిటీ నాయకులు బి మల్లేశ్ పిలుపునిచ్చారు. రుద్రూర్ మండల కేంద్రంలో బుధవారం బీడీ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీల పైన కేంద్రం 28% విధిస్తున్న జీఎస్టీని వెంటనే తగ్గించాలని, సుప్రీంకోర్టు చెప్పినట్లు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సావిత్రి, సునీత, పార్వతి, గంగా, స్వరూప, విజయలక్ష్మి, లత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందడం అభినందనీయం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహించి పదోన్నతిపై వెళ్తున్న అధికారులను బుధవారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజు మాట్లాడుతూ.. ఆర్మూర్ మున్సిపల్‌లో విధులు నిర్వహించిన మున్సిపల్ మేనేజర్ హయ్యూం, శానిటరి ఎస్సై గజనాంద్, బిల్‌కలెక్టర్లు మోహన్, దిలీప్, యశ్వంత్ అందించిన సేవలు మరువలేమన్నారు. అనంతరం అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌వో ఉమాదేవి, టీపీవో ఆంజనేయులు, అధికారులు శేఖర్, దత్తారెడ్డి, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ఆర్మూర్‌టౌన్: ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని శానిటరి పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని 5, 6వ వార్డులో వంద రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుధ్య, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని అధికారులు కాలనీవాసులకు సూచించారు. వార్డు అధికారులు నర్సయ్య, రాజన్న, గోపి, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలి

- ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చిగ్తియన్ మావి

బోధన్: ఎడపల్లి మండలంలోని జానకంపేట, ఠానాకలాన్ జీపీల పరిధిలో ఉపాధి హామీ పథకం కింద నిర్వహిస్తున్న నర్సరీలను బుధవారం జిల్లా ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చిగ్తియన్ మావి సందర్శించి మొక్కల సంరక్షణ తీరును పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలను జీపీ కార్యదర్శులతో అడిగి తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఏపీవో శ్రీవాణి, జీపీ కార్యదర్శులు ప్రేందాస్, రంజిత్‌లు ఉన్నారు.